ప్రజల చేతిలో
www.ayudamdaily.com
ఆయుధం
The Common People's Voice
బుధవారం | ఆగస్టు 26, 2026 | సంపుటి : 7 | సంచిక : 75 | పేజీలు : 2

పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

- ప్రతి రోజు చెత్త సేకరణ, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి
- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న

2 లో

ప్రాజెక్టుల భూసేకరణ, పరిహారం చెల్లింపులు వేగవంతం చేయాలి

- రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

వరంగల్, ఆయుధం: రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పునరావాస చర్యలు, అటవీ అనుమతులు, భూబాధితులకు పరిహారం చెల్లింపుల పురోగతిపై నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం అన్నీ జిల్లాల కలెక్టర్ లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జలసౌధలోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా వారీగా ప్రత్యక్షంగా, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన ఈ సమీక్షలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, అటవీ అనుమతులు, పునరావాస చర్యలు, పరిహారం చెల్లింపులపై సమగ్రంగా సమీక్షించారు. ఈ వీసీ లో కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ పాల్గొన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, అటవీ అనుమతులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో... అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని మంత్రి సూచించారు. ప్రాజెక్టుల వారీగా, జిల్లాల వారీగా పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, అటవీ అనుమతుల వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక శాఖ నుంచి కలెక్టర్ల PD ఖాతాలకు జమ అయిన నిధులు, భూబాధితులు, అర్హులైన లబ్ధిదారులకు ఇప్పటికే చెల్లించిన పరిహారం వివరాలను సమీక్షించారు. కలెక్టర్ల PD ఖాతాల్లో నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ చెల్లింపులు పెండింగ్‌లో ఉండటానికి గల కారణాలను గుర్తించి, సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి భూబాధితుడికి పరిహారం సకాలంలో అందేలా స్పష్టమైన గడువుతో (మిగతా 2 లో..)

ఇంకా.. ఉపేక్షించొద్దు

- మంత్రి కొండా సురేఖపై చర్యలు తీసుకోవాల్సిందే
- పీసీసీకి క్రమశిక్షణ కమిటీ నివేదిక
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపైనా చర్యలకు కమిటీ సిఫారసు

"పార్టీ నియమాలను కొండా సురేఖ ఉల్లంఘించడం ఇది మూడోసారి. ఇంకా ఉపేక్షిస్తే పార్టీకి తీరని నష్టం వాటిల్లుతుంది. సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించాలి. సీనియర్ నేతగా ఉన్న చిన్నారెడ్డి పార్టీలో సుదీర్ఘకాలం ఎన్నో పదవులు అనుభవించారు. క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్‌గానూ పనిచేశారు. ఆయన కూడా పార్టీకి నష్టం కలిగించేలా మాట్లాడారు. క్యాబినెట్ ర్యాంకు పదవిలో ఉన్న చిన్నారెడ్డిని కూడా ఆ పదవి నుంచి తొలగించాలి" అని క్రమశిక్షణ కమిటీ సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది.

మంత్రి కొండా సురేఖ, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై క్రమశిక్షణ కమిటీ రూపొందించిన నివేదిక పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు అందింది. ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి, వైస్ ఛైర్మన్ శ్యామ్ మోహన్ ఈ నివేదికను మహేశ్‌కుమార్ గౌడ్‌కు అందజేశారు. కొండా సురేఖ, చిన్నారెడ్డిపై చర్యలకు కమిటీ సిఫార్సు చేసినట్లు సమాచారం. కుమార్తె సుస్మిత వ్యాఖ్యలను సురేఖ ఖండించాల్సిందని కమిటీ అభిప్రాయపడినట్లు తెలుస్తోంది.

– హైదరాబాద్, ఆయుధం:

నివేదిక సమర్పించిన అనంతరం గాంధీభవన్‌లో క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి మీడియాతో మాట్లాడారు. కొండా సురేఖ, చిన్నారెడ్డి ఇచ్చిన వివరణ ఆధారంగా పీసీసీ అధ్యక్షుడికి నివేదిక ఇచ్చామని చెప్పారు. కాంగ్రెస్ గౌరవాన్ని దెబ్బతీసే పనులు ఎవరూ చేయొద్దని.. వచ్చే ఎన్నికల్లో పార్టీకి నష్టం కలిగేలా ఎవరూ మాట్లాడవద్దన్నారు. "అన్ని అంశాలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక ఇచ్చాం. హద్దులు దాటిన నేతలందరికీ స్పష్టమైన హెచ్చరిక ఇవ్వాల్సి ఉంది. క్రమశిక్షణా చర్యలు కఠినంగా ఉండాలని నివేదిక ఇచ్చాం. అందులో ఏముందో ముందే చెబితే అధిష్ఠానం నుంచి నాకు నోటీసులు వస్తాయి. పార్టీ అంతర్గత వ్యవహారాలను ఎవరూ బయటపెట్టొద్దని ప్రధానంగా నివేదికలో పేర్కొన్నాం. కొండా సురేఖ, చిన్నారెడ్డి వ్యక్తిగతంగా కలవలేదు. గాంధీభవన్‌లో వివరణ లేఖ ఇచ్చి వెళ్లారు. ఈ నివేదికను సీఎం రేవంత్‌కు ఇవ్వలేదు. పార్టీకి సంబంధించిన విషయం కాబట్టి పీసీసీ అధ్యక్షుడికి అందజేశాం. ఈ విషయంలో ఊహాజనిత అంశాలు ప్రచారం చేయొద్దు" అని మల్లు రవి అన్నారు.

నిర్ణయంపై ఉత్కంఠ..

కొండా సురేఖ, చిన్నారెడ్డిపై పీసీసీ అధ్యక్షుడికి సమర్పించిన నివేదికలో క్రమశిక్షణ కమిటీ పలు సిఫార్సులు చేసినట్లు సమాచారం. "పార్టీ నియమాలను కొండా సురేఖ ఉల్లంఘించడం ఇది మూడోసారి. ఇంకా ఉపేక్షిస్తే పార్టీకి తీరని నష్టం వాటిల్లుతుంది. సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించాలి. సీనియర్ నేతగా ఉన్న చిన్నారెడ్డి పార్టీలో సుదీర్ఘకాలం ఎన్నో పదవులు అనుభవించారు. క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్‌గానూ పనిచేశారు. ఆయన కూడా పార్టీకి నష్టం కలిగించేలా మాట్లాడారు. క్యాబినెట్ ర్యాంకు పదవిలో ఉన్న చిన్నారెడ్డిని కూడా ఆ పదవి నుంచి తొలగించాలి" అని క్రమశిక్షణ కమిటీ సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. కమిటీ నివేదిక నేపథ్యంలో ఈ ఇద్దరు నేతలపై కాంగ్రెస్ పార్టీ తీసుకునే నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది.

ఫీజు బకాయి బీజేపీ లడాయి

- బీజేపీ 48 గంటల నిరాహార దీక్ష
- స్టేట్ చీఫ్‌కు గంట రవికుమార్ మద్దతు

హైదరాబాద్, ఆయుధం: విద్యార్థుల న్యాయమైన హక్కుల కోసం, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల విడుదలకు డిమాండ్ చేస్తూ తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచందర్ రావు చేపట్టిన 'ఫీజు బకాయి బీజేపీ లడాయి' 48 గంటల నిరాహార దీక్షలో బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ పాల్గొని సంఘీభావం తెలిపారు. విద్యార్థి నాయకుడిగా ప్రారంభమై, ఎమ్మెల్సీగా ప్రజాసేవ చేసి, నేడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్. రామచందర్ రావు కి విద్యార్థుల కష్టాలు, సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉందని అన్నారు. విద్యార్థుల పక్షాన నిలబడి, రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా పోరాడుతున్న వారికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ... ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు రాక కోర్సులు పూర్తయినా విద్యార్థులకు సర్టిఫికెట్లు చేతికి రావడం లేదు. కాలేజీ (మిగతా 2 లో..)

నీట్–పీజీ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

హనుమకొండ, ఆయుధం: ఈనెల 30న నిర్వహించనున్న నీట్ -పీజీ 2026 ప్రవేశ పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వర్షాభావ పరిస్థితులు, నీట్ -పీజీ పరీక్ష ఏర్పాట్లు, పర్యాటక అభివృద్ధి తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్ల తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ నుంచి సీపీ శ్వేత, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. (మిగతా 2 లో..)

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

- రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

వరంగల్, ఆయుధం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటలని, నాటిన ప్రతి మొక్కను రక్షించాలని, ఇందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు అవ్వాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ప్రతి ఇంటా మొక్కలు నాటి పెంచడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని ఆమె అన్నారు. వరంగల్ నగరంలోని రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమానికి మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొని కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద,జిల్లా ఫారెస్ట్ అధికారి నిఖిత, గ్రంథాలయ చైర్మన్ మీసాల ప్రకాశ్ పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నూతన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించి, వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం కారణంగా వన మహోత్సవ కార్యక్రమం కొంత (మిగతా 2 లో..)

శ్రీభద్రకాళి అమ్మవారికి సారే

వరంగల్, ఆయుధం: శ్రావణమాసం సందర్భంగా శ్రీభద్రకాళి అమ్మవారికి శంకేసి రమాదేవి గ్రూప్ ఆధ్వర్యంలో మంగళవారం సారే సమర్పించారు. రంగసాయిపేట ప్రాంతానికి చెందిన శంకేసి రమాదేవి ఈ కార్యక్రమాన్ని మొదటిసారిగా నిర్వహించామని వారు తెలిపారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. మహిళామణులు భక్తిశ్రద్ధలతో తయారుచేసిన పిండి వంటకాలు అమ్మవారి ఆలయానికి చేరుకొని ఆలయ ప్రధాన పూజారి భద్రకాళి శేషు సమక్షంలో వేదమంత్రాలతో భద్రకాళి వారికి సారే సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఇటికాల సంధ్యారాణి, పెద్ది మమత, మదూరి సంధ్య, అడుప సరిత, దూలం మంజుల, బోరిగం రజిత, కొండ్ర గోపి, కోయడ సుజాత, కుల్ల విజయ లక్ష్మీ, ద్రౌపతి, రజిత, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు గాలికి వదిలేయడం తగదు

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

వరంగల్, ఆయుధం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించాల్సిన అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు పరస్పర విమర్శలు, అంతర్గత కుమ్ములాటలకే పరిమితమవడం దురదృష్టకరమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం సిపిఐ వరంగల్ జిల్లా కౌన్సిల్ సమావేశం దిడ్డి పార్థసారథి అధ్యక్షతన వరంగల్ శివనగర్ లోని తమ్మెరభవన్ లో జరిగింది. తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలు ఎన్నో సమస్యలతో సతమతమవుతుంటే, నాయకులు మాత్రం వరంగల్ జిల్లా అభివృద్ధి విస్మరించి, వ్యక్తిగత ప్రయోజనాలు, కుర్చీలాటల కోసం పాకులాడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలు రోజురోజుకూ పేరుకుపోతున్నాయని, వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యారని విమర్శించారు. నిరుద్యోగం, రైతుల సమస్యలు, తాగునీరు, మౌలిక వసతుల కొరత వంటి తీవ్రమైన ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాల్సింది పోయి, నాయకులు గ్రూపు రాజకీయాలతో కాలం వెళ్లదీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తే ప్రజలే తగిన సమయంలో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ వలివుల్లా ఖాద్రి, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, మేకల రవి, దండు లక్ష్మణ్, పి.ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

- హెవీ వెహికల్స్ సిటీ బయట పార్క్ చేసేలా చర్యలు తీసుకోవాలి
- రహదారులపై ఎడ్జ్ లైన్స్ స్పష్టంగా కనిపించాలి
- వెండింగ్ జోన్లకు స్థలాన్ని కేటాయించాలి
- వినాయక విగ్రహాలను విక్రయించేందుకు ప్రత్యేక ప్రదేశాల కేటాయింపునకు చర్యలు
- పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

హనుమకొండ, ఆయుధం: రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో రోడ్లు, భవనాలు శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి రోడ్డు భద్రతా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో రోడ్డు భద్రత సంబంధించి చేపట్టిన చర్యల గురించి ఆర్ అండ్ బి ఈఈ దేవిక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత మాట్లాడుతూ... ప్రతీ వాహనదారులు రోడ్ భద్రత నియమాలను పాటించాలని తెలిపారు. ప్రైవేట్ బస్సులు, టాక్సీ వాహనాలు రోడ్ల పక్కన నిలిపి ఉంచడం వలన ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతాయని, రంగలీలా మైదానం, హయాగ్రీవాచారి మైదానంలో నిలిపేవిధంగా మున్సిపల్, కుడా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలను ఉల్లంఘిస్తే తగు చర్యలు తీసుకోవాలన్నారు. రహదారులపై హద్దులకు సంబంధించి లైన్ మార్కింగ్ స్పష్టంగా కనిపించే విధంగా ఉండాలన్నారు. వాహనాలను ఇష్టారీతిన పార్కింగ్ చేయకుండా నో పార్కింగ్ బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రంబుల్ స్ట్రిప్స్, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, రహదారులపై విద్యుద్దీపాలు వెలిగేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు బాధితుల ప్రాణాలను కాపాడే ప్రయత్నంలో సమీప ఆసుపత్రులను గుర్తించి అక్కడికి తరలించే విధంగా అత్యవసర వాహనాల డ్రైవర్లకు, బ్లూ కోట్స్ సిబ్బందికి పూర్తిస్థాయి అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదం జరిగిన ప్రదేశం నుండి త్వరగా క్షతగాత్రులను వారి ఆరోగ్య పరిస్థితిని బట్టి హాస్పిటల్స్ కు తరలించేలా మ్యాపింగ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న బ్లాక్ స్పాట్స్ ను గుర్తించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న (మిగతా 2 లో..)

2 లో

అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ అరెస్టు

- రూ.1.25 కోట్ల విలువగల 251 కిలోల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం, రూ.9వేల నగదు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం

వరంగల్, ఆయుధం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో యువతను మత్తు పదార్థాలకు బానిసలుగా మారకుండా, వారి బంగారు భవిష్యత్తును కాపాడటంతో పాటు, గంజాయి, ఇతర మత్తు పదార్థాలను విక్రయాలకు పాల్పడే వారిని నియంత్రించి గంజాయి రహిత సమాజమే లక్ష్యంగా వరంగల్ కమిషనరేట్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు.

ఫొటో జర్నలిస్టు హరీష్‌కు అవార్డు

ఆంధ్రప్రదేశ్ ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఫొటో గ్రఫీ ఫొటోలో అవార్డు పొందిన చిత్రానికి గాను ఫొటో జర్నలిస్టు హరీష్ మంగళవారం విజయవాడ లో అవార్డును అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ చేతులమీదుగా ఈ అవార్డు అందజేశారు.

మేరుగు ప్రతాప్‌కు జాతీయ ఉత్తమ

ఫొటోగ్రాఫర్ అవార్డు

వరంగల్, ఆయుధం: వరంగల్ కాశిబుగ్గకు చెందిన, ప్రస్తుతం నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫొటోగ్రాఫర్‌గా రాజన్న సిరిసిల్ల జిల్లాలో విధులు నిర్వరిస్తున్న మేరుగు ప్రతాప్‌కు జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ (APPJA) నిర్వహించిన APPJA నేషనల్ ఫొటో కాంటెస్ట్-2026లో ప్రతిభ కనబరిచిన ఆయనకు జాతీయ ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డు లభించింది. విజయవాడలోని గాంధీనగర్ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవంలో ఈ పురస్కారాన్ని ప్రతాప్ అందుకున్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాఘవాచారి మీడియా అకాడమీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్, ఏపీ స్టేట్ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ సీఈఓ ఆర్. మల్లికార్జున, అతిథులుగా ఐజేయూ సెక్రటరీ జనరల్ డి. సోమసుందర్, ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు ఈవీ సుబ్బారావు, జనరల్ సెక్రటరీ కె. జయరాజ్ పాల్గొన్నారు. తనకు అవార్డు అందజేసిన ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ బాధ్యులకు ప్రతాప్ కృతజ్ఞతలు తెలిపారు. కాగా, జాతీయ స్థాయి ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డు అందుకున్న ప్రతాప్ ను సిరిసిల్ల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పలువురు ఫొటోగ్రాఫర్లు, జర్నలిస్టు సంఘాల నాయకులు, పద్మశాలి సంఘాల నాయకులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు, రివార్డులు అందుకోవాలని వారు ఆకాంక్షించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

(మొదటి పేజీ తరువాయి..)

హసన్ పర్తి చెరువు కట్ట వద్ద రహదారి వెడల్పు చేయడం జరిగిందని, రోడ్డు మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేయాలని, పోతన నగర్ వద్ద డ్రైనేజీ నిర్మాణ పనులను పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. రోడ్డును ఆనుకుని హెవీ వెహికల్స్, ప్రైవేట్ బస్సులు, ఇతర వాహనాలు పార్కు చేసి ఉంటున్నాయని, దీని వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అలా కాకుండా ఉండేందుకు ప్రత్యేకంగా.... సిటీ కి దూరంగా వాహనాలు పార్కు చేసే ప్రదేశాలను అధికారులు గుర్తించాలన్నారు. ప్రైవేట్ బస్సులు, వాహనాలు రోడ్డు పక్కన ఇష్టారీతిన నిలిపి ఉంచుతున్నారని, వాహన యజమానులతో అధికారులు మాట్లాడి ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. నగరంలో ఫుట్ పాత్ లను ఆక్రమించడంతో.... పాదాచారులకి ఇబ్బందులు తలెత్తుతున్నాయని, స్ట్రీట్ వెండర్స్ కోసం వెండింగ్ జోన్లు ఏర్పాటుకు స్థలాలను పరిశీలించాలని సూచించారు. స్ట్రీట్ వెండర్స్ ఎక్కడపడితే అక్కడ విక్రయాలు చేయకుండా, స్ట్రీట్ వెండింగ్ జోన్లలోనే విక్రయాలు చేసేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. స్ట్రీట్ వెండర్స్ కోసం వెండింగ్ జోన్లు ఏర్పాటు చేసేందుకు స్థలాలను గుర్తించాలన్నారు. గణపతి విగ్రహాలు ప్రధాన రహదారుల పక్కన కాకుండా ఎవరికీ ఇబ్బంది కలగకుండా ఖాళీ మైదానంలో క్రయ విక్రయాలు చేసుకునేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. జోన్ డీసీపీ దార కవిత, జిల్లా అదనపు కలెక్టర్ లు ఎన్. రవి,శేషాద్రి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, జాతీయ రహదారుల శాఖ వరంగల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ భరద్వాజ్, ఆర్ అండ్ బీ ఎన్హెచ్ ఈఈ కిరణ్ కుమార్, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, కుడా సీపీవో అజిత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంతర్‌రాష్ట్ర గంజాయి స్మగ్లర్ అరెస్టు

- **రూ.1.25 కోట్ల విలువగల 251 కిలోల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం, రూ.9వేల నగదు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం**

వరంగల్, ఆయుధం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో యువతను మత్తు పదార్థాలకు బానిసలుగా మారకుండా, వారి బంగారు భవిష్యత్తును కాపాడటంతో పాటు, గంజాయి, ఇతర మత్తు పదార్థాలను విక్రయాలకు పాల్పడే వారిని నియంత్రించి గంజాయి రహిత సమాజమే లక్ష్యంగా వరంగల్ కమిషనరేట్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. అంతర్ రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న నిందితుడని ఈస్ట్‌జోన్ డిసిపి అంకిత్‌కుమార్ అధ్వర్యంలో దామెర పోలీసులు అదుపులోకి తీసుకోని విచారణ చేయగా గంజాయి కోనుగోలు, విక్రయాలకు సంబంధించి కీలక వివరాలను వెలుగులోకి వచ్చాయి. దామెర మండలం పులుకుర్తికి చెందిన ముదిగొండ నాగేశ్వర్ రావు(55) సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో నిందితుడు తనకు వున్న నెట్ వర్క్ ద్వారా ఒడిషా రాష్ట్రానికి చెందిన రమేష్, సుధాకర్ వద్ద తక్కువ ధరకు గంజాయి కోనుగోలు చేసి తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, అంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించి నిందితులు ఉర్దు, రాందాస్ శేషరావు బీరదార్, అక్లీం, షారుఖ్ ఖాన్, షేక్ అక్బర్, నునావత్ రాజుల ద్వారా ఎక్కువ ధరకు విక్రయించినట్లుగా ప్రాథమిక విచారణలో వెల్లడైంది. నిందితుడు ఇచ్చిన సమాచారం పోలీసులు అతని ఇంటి నుండి సుమారు భారీ మొత్తంలో సుమారు రూ.1.25 కోట్ల విలువగల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి పోలీసులు దర్యాప్తు చేపట్టడంతో పాటు పోలీసులకు పట్టు బడిన నిందితుడు నాగ్యేశ్వర్ రావు నుండి గంజాయి కోనుగోలు చేసిన మిగితా రాష్ట్రాలకు చెందిన నిందితులను పట్టుకొనేందుకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. గంజాయి స్మగ్లర్‌ను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పరకాల ఏసిపి సతీష్ బాబు, శాయంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, ఆత్మకూర్ ఇన్స్పెక్టర్ సంతోష్, దామెర ఎస్.వ వీరభద్రరావు, శాయంపేట ఎస్.ఐ పరమేశ్వర్, పరకాల ఎస్.ఐ రఘుపతితో పాటు ఏఏఓ సల్మాన్ పాషా, దామెర, శాయంపేట కానిస్టేబుళ్ళను అభినందించారు.

నీట్–పీజీ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

(మొదటి పేజీ తరువాయి..)

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, ఆగస్టు 30న నిర్వహించనున్న నీట్ -పీజీ 2026 ప్రవేశ పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. రాష్ట్రంలోని 14 జిల్లాల్లో 56 పరీక్షా కేంద్రాల్లో 17,627 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్ష ఉదయం 9 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12.30 గంటలకు ముగుస్తుందని, అభ్యర్థులు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం, విద్యుత్, జనరేటర్ బ్యాకప్, వెలుతురు, వెంటిలేషన్ తదితర మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉండేలా ముందస్తు తనిఖీలు నిర్వహించాలని సీఎస్ తెలిపారు. అభ్యర్థుల గుర్తింపు, తనిఖీలను నిబంధనల ప్రకారం నిర్వహించాలని, మొబైల్ ఫోన్లు, బ్లూటూత్ పరికరాలు, ఏఐ గ్లాసెస్, స్పై కెమెరాలు తదితర నిషేధిత వస్తువులను అనుమతించరాదని ఆదేశించారు. ప్రశ్నాపత్రాల భద్రత, గోప్యతకు పూర్తి రక్షణ కల్పించాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను ప్రాధాన్యతా ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని, ప్రతి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను అనుసంధానిస్తూ సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఆధ్యాత్మిక, చారిత్రక, వారసత్వ, ఎకో టూరిజం, హస్తకళలు, జల పర్యాటక ప్రాంతాలను గుర్తించి వాటిని అనుసంధానిస్తూ పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. పర్యాటక ప్రాంతాల్లో రహదారులు, పార్కింగ్, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, శుభ్రత, సూచిక బోర్డులు, ఇతర సందర్శకుల సౌకర్యాలను మెరుగుపరచాలని సీఎస్ ఆదేశించారు. ప్రతి ప్రత్యేక పర్యాటక ప్రాంతానికి స్పష్టమైన అభివృద్ధి కార్యాచరణ, బాధ్యతలు, కాలపరిమితి రూపొందించి పనుల పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షించాలని సూచించారు. స్థానిక కళలు, హస్తకళలు, స్థానిక ఆహారం, సంస్కృతికి ప్రాధాన్యతనిస్తూ స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, హోమ్‌స్టేలు, స్థానిక గైడ్ సేవలను ప్రోత్సహించాలని తెలిపారు.తెలంగాణ సంస్కృతి, కళలు, హస్తకళలు, చారిత్రక వారసత్వం, స్థానిక ఆహారం, పండుగలు, సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేయడం ద్వారా 'బ్రాండ్ తెలంగాణ'కు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని సీఎస్ తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 22 శాతం లోటు వర్షపాతం నమోదైందని, సెప్టెంబర్ చివరి వరకు పెద్దగా వర్షాలు కురిసే అవకాశం లేదని వాతావరణ నిపుణులు సూచించినట్లు సీఎస్ తెలిపారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు, సాగునీరు, తాగునీటి లభ్యతను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, డి ఆర్వో శ్రీనివాస్, జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

- **ప్రతి రోజు చెత్త సేకరణ, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి**
- **జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న**

వరంగల్, ఆయుధం: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత పటిష్టంగా చేపట్టాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని పలు డివిజన్లలో ఆకస్మికంగా పర్యటించి చెత్త సేకరణ, పారిశుద్ధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. మోడల్ డివిజన్ గా ఎంపిక చేసిన 13వ డివిజన్ శ్రీనివాస కాలనీ, నవయుగ కాలనీలలో పర్యటించిన కమిషనర్ ఇంటింటి చెత్త సేకరణ, తడి-పొడి, హానికరమైన చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక గృహిణులు, ప్రజలతో నేరుగా మాట్లాడి చెత్త సేకరణ ఆటో ప్రతిరోజూ వస్తుందా, సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. చెత్త సేకరణపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. అదే కాలనీలో నిర్మాణ వ్యర్థాలను డ్రైనేజీలో పడవేసిన విషయం కమిషనర్ దృష్టికి రావడంతో, సంబంధిత వ్యక్తులను గుర్తించి నిబంధనల మేరకు జరిమానా విధించాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ వ్యర్థాలను డ్రైనేజీల్లో వేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం చిన్న వడ్డేపల్లి చెరువు ప్రాంతంలో వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్, నిమజ్జనానికి ముందే ప్రాంతంలో ఎక్కడైనా చెత్త పేరుకుపోయి ఉంటే వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. వినాయక చవితి సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పాత కరవాణి ప్రాంతం మొత్తం పరిశుభ్రంగా, నీట్‌గా ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. తదుపరి రంగసాయిపేట డిగ్రీ కళాశాలను సందర్శించిన కమిషనర్, వన మహోత్సవ కార్యక్రమంలో మంత్రి కొండ సురేఖ పాల్గొనుచున్న నేపథ్యంలో పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత, ఇతర అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో సానిటరీ సూపర్‌వైజర్ గోపాల్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రశాంతి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నగరానికి అందం.. పర్యావరణానికి ప్రాణం

- **మొక్కలు నాటుదాం.. వరంగల్‌ను పచ్చని నగరంగా తీర్చిదిద్దుదాం**
- **జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న**

వరంగల్, ఆయుధం: నగరానికి అందం.. పర్యావరణానికి ప్రాణం.. మొక్కలే ఆధారమని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) ఆధ్వర్యంలో మంగళవారం వరంగల్ నగరంలోని తోట మైదానంలో సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టీ. వెంకన్న ఈ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మొక్కలు నాటుదాం.. వరంగల్‌ను పచ్చని నగరంగా తీర్చిదిద్దుదామని అన్నారు. నగరంలో పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. వనమహోత్సవంలో భాగంగా బల్దియా ఆధ్వర్యంలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మొక్కలు నాటడంతో కార్యక్రమం పూర్తికాదని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించి, అవి వృక్షాలుగా ఎదిగేలా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. నగరంలో పచ్చదనం పెంపొందించేందుకు ఖాళీ ప్రదేశాలు, రహదారుల వెంట, పార్కులు, ప్రభుత్వ స్థలాల్లో అనువైన మొక్కలను నాటడంతో పాటు వాటి సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించడం, రక్షణ కల్పించడం, మొక్కల పెరుగుదలను పర్యవేక్షించడం వంటి చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రజలు కూడా వనమహోత్సవ కార్యక్రమాల్లో భాగస్వాములై తమ పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కమిషనర్ పిలుపునిచ్చారు. పచ్చని, పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వరంగల్ నగర నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బస్వరాజ్ కుమారస్వామి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేశ్, ఇంజనీరింగ్, హార్టికల్చర్ విభాగాల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీసీల వాటా సాధించడమే బీపీ మండల్ కు నిజమైన నివాళి

వరంగల్, ఆయుధం: దేశంలో సగానికి పైగా ఉన్న బీసీలకు సకల రంగాలలో వాటా దక్కినప్పుడే బీపీ మండల్ ఆశయం నెరవేరుతుందని తాటిపాముల వెంకట్రాములు అన్నారు. బిసి హక్కుల సాధన సమితి వరంగల్ మండల ప్రధాన కార్యదర్శి కార్యదర్శి చెలుకల రాజు, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన వరంగల్ హెడ్ పోస్టాఫీసు సెంటర్ లో జరిగిన బిపి మండల్ 108వ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ప్రధానకార్యదర్శి చింతకింది కుమారస్వామితో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న వెంకటరాములు మాట్లాడుతూ బిసి సామాజిక వర్గానికి చెందిన బిందేశ్వర్ ప్రసాద్ మండల్ 1979జనవరి 1న ఏర్పాటు చేసిన రెండవ బిసి కమీషన్ కు ఛైర్మన్ వ్యవహరించి 1980డిసెంబర్ 31న తన నివేదికను ప్రభుత్వానికి అందించారు . నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నివేదికను పట్టించుకోకున్నా,అప్పటి వరకు కేవలం 5శాతం మాత్రమే బిసిలకు రిజర్వేషన్లు అందుతుండగా 1990లో విపి సింగ్ ప్రభుత్వం అగ్రకులాల ఆందోళనల మధ్య మండల్ కమిషన్ సిఫారసుల ఆధారంగా 27శాతం రిజర్వేషన్లు ఖరారు చేశారన్నారు. ఇందిరా సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు తీర్పు తర్వాత1992 నుంచి మాత్రమే రిజర్వేషన్లు అమలు అవుతున్నాయన్నారు.మండల్ కమీషన్ సిఫారసులను అమలు చేసినందుకు నాటి అగ్రకుల బిజెపి, కాంగ్రెస్ పార్టీలు విపి సింగ్ ప్రభుత్వాన్ని పడగొట్టాయన్నారు.ఇప్పటికైనా అన్ని అగ్రకుల పార్టీల వెనుక ఉన్న బీసీలంతా ఏకమై అన్ని రంగాల్లో బిసిల వాటా సాధించడానికి బిసి హక్కుల సాధన సమితి నిర్మించే బలమైన ఉద్యమంలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో శైలజ సరళాదేవి స్వరూప రాంబాయి లింగమ్మ భాస్కర్ రమేష్ శకుంతల పాల్గొన్నారు

జీవో 97 రద్దు చేసి, శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలి

- **పెండింగ్ ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్ షిప్స్ విడుదల చేయాలి**
- **ఏఐఎఫ్ డిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున**

హనుమకొండ, ఆయుధం: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన శక్తి పాలసీ, టెక్నికల్ ఎడ్యుకేషన్‌ను విలీనం చేస్తూ జారీ చేసిన జీవో నంబర్ 97ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమఖ్య హన్మకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏ.ఓ. గౌరీ శంకర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గడ్డం నాగార్జున మాట్లాడుతూ సాంకేతిక విద్యా వ్యవస్థను శక్తి పాలసీలో విలీనం చేసి, ఐటిఐలతో కలపడం వల్ల పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తు తీవ్ర ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ కళాశాలల స్వయం ప్రతిపత్తిని కాపాడాల్సింది పోయి, కేవలం మార్కెట్ ఆధారిత చౌక కార్మిక శక్తిని తయారు చేసే కేంద్రాలుగా మార్చడానికి ప్రభుత్వం ప్రయత్నించడం దారుణమన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, విద్యావేత్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా తెచ్చిన జీవో 97ను వెంటనే ఉపసంహరించుకోవాలని, రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి (ఎస్ బి టేట్)ని స్వతంత్ర శాఖగా యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఫీజు రీఎంబర్స్మెంట్ స్కాలర్షిప్లు విడుదల కాక సుమారు 14 లక్షల మంది విద్యార్థులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడింది విద్యార్థులు పై చదువులు చదువుకోవడానికి ఉద్యోగం చేసుకోవడానికి సర్టిఫికెట్స్ తీసుకోవడానికి కాలేజీలకు వెళ్తే కాలేజ్ యాజమాన్యం ఫీజు కడితేనే సర్టిఫికెట్ ఇస్తామని చెప్పడం జరుగుతోంది దాని వలన విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు కావున విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తక్షణమే పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్ షిప్స్ విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. లేనిపక్షంలో విద్యార్థులను కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గడ్డం రామ్ చరణ్, దినేష్, రాజు, విష్ణు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు

మొక్కలు నాటాలి

(మొదటి పేజీ తరువాయి..)

ఆలస్యమైందన్నారు. ఒక్క రోజులోనే 10 శాతం మొక్కలు నాటేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటిలో, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించారు. సకాలంలో వర్షాలు కురవకపోవడానికి సరైన వృక్ష సంపద లేకపోవడం కూడా ఒక ప్రధాన కారణమని మంత్రి పేర్కొన్నారు. వృక్షాలు మానవ మనుగడకు ఎంతో దోహదపడతాయని, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు చెట్లు అత్యంత అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పెంచి సంరక్షించాలనే కృతనిశ్చయంతో ముందుకు సాగాలని సూచించారు. పుట్టినరోజులు, వివాహాలు, ఇతర శుభకార్యాల సందర్భంగా మొక్కలు నాటే సంప్రదాయాన్ని అలవాటు చేసుకోవాలని మంత్రి కోరారు. మొక్కలను నాటడం తో పాటు వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. చెట్లను నరకకుండా కాపాడాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో 25 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని, ఇప్పటివరకు సుమారు 13 లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. మిగిలిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

వృక్ష సంపదతోనే పర్యావరణ సమతుల్యత

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీసీఎఫ్ భీమా నాయక్ మాట్లాడుతూ వృక్ష సంపద సమృద్ధిగా ఉంటే వాతావరణ మార్పుల ప్రభావం తగ్గి, సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని వృక్షాలుగా తీర్చిదిద్దే బాధ్యతను తీసుకోవాలని సూచించారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో సుమ, జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, తహసీల్దార్ ఇక్బాల్, వివిధ శాఖల అధికారులు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫీజు బకాయి..

బీజేపీ లడాయి

(మొదటి పేజీ తరువాయి..)

ఫీజులు చెల్లించేందుకు పేద విద్యార్థుల తల్లులు తమ తాళిబొట్లు సైతం తాకట్టు పెట్టి అప్పులు తెస్తున్నారు. ఇంతకంటే దారుణమైన పరిస్థితి ఇంకేముంటుంది? అని ప్రశ్నించారు. ''రాహుల్ గాంధీ హైదరాబాద్ వచ్చి యువతకు ఇచ్చిన హామీలన్నీ ఏమయ్యాయి? ఉన్నత చదువుల కోసం బ్యాంకుల ద్వారా ₹5 లక్షల రుణం ఇప్పిస్తామని చెప్పి మోసం చేశారు. విద్యాశాఖ ముఖ్యమంత్రి గారి వద్దే ఉంది. విద్యార్థులను 'క్రిమినల్ వేస్ట్' అంటూ ఆయనే అవమానించడం దుర్మార్గం. రాష్ట్రంలో సరైన విద్యను అందించలేకపోతున్నామని సీఎం స్వయంగా తన వైఫల్యాన్ని ఒప్పుకున్నారు. తక్షణమే రేవంత్ రెడ్డి గారు విద్యాశాఖ బాధ్యతల నుంచి తప్పుకుని రాజీనామా చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, పెండింగ్‌లో ఉన్న ₹15,000 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను ఒకే విడతలో విడుదల చేయాలి. నిధులు విడుదల చేసి విద్యార్థులకు న్యాయం జరిగేంత వరకు భారతీయ జనతా పార్టీ అండగా ఉండి పోరాడుతుంది.'' అని రవికుమార్ పేర్కొన్నారు.

వెంకటస్వామికి

కురుమల ఘన సన్మానం

వరంగల్, ఆయుధం: వరంగల్ నగరంలోని బార్ధన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా కోరే వెంకటస్వామిని మంగళవారం రామ్ కీలోని వారి స్వగృహంలో సన్మానించారు. వరంగల్ కురుమ పెళ్లి పందిరి కన్వీనర్లు, అన్న రాజు కురుమ మండల నరసింహ రాములు కురుమ, నరిగె శ్రీను కురుమ, బండారి అరవింద్ కురుమ, మహబూబాబాద్ జిల్లా కురుమ సంఘం అధ్యక్షులు చీర అశోక్ కురుమలు వెళ్లి మర్యాద పూర్వకంగా కలిసి వెంకటస్వామిని శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అన్న రాజు కురుమ మాట్లాడుతూ వెంకటస్వామి బార్ధాన్ మర్చంట్ అసోసియేషన్ సంబంధించిన ప్రతి విషయంలో మీరు ముందుంటూ సంఘం అభివృద్ధి పథంలో నడపాలని మరెన్నో పదవులకు అధిరోహించాలని వారు తెలిపారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Beh